



రంజాన్ వేళలు
ఇఫ్తార్ - సోమవారం
సాయంత్రం - 6:34
సహర్ - మంగళవారం
ఉదయం - 4:54

రంగుల పండుగకు రెడీ



ఆమనగల్లులో రంగుల విక్రయాలు

నేడే హోలీ...

రంగుల పండుగ హోలీ వేడుకలను ఉత్సాహంగా జరుపుకునేందుకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలు సన్నద్ధమయ్యారు. కులమతాలకతీతంగా అందరూ రెడీ అయ్యారు. సోమవారం హోలీ పండుగ నేపథ్యంలో యువతీ యువకులు, చిన్నారులు రంగులు కొనుగోలు చేస్తూ కన్పించారు. నేడు హోలీ పండుగ కావడంతో ఒక రోజు ముందే విద్యార్థులు మోదుగ చెట్ల నుంచి పూలను సేకరించి వాటికి పసుపు కలిపి రంగు తయారు చేసి పెట్టుకున్నారు. ప్రకృతి సిద్ధమైన రంగులతో ఆదివారం కొన్నిచోట్ల హోలీ జరుపుకున్నారు.





బొంరాస్‌పేట్‌లో కాముడి దహనం..



మోమిన్‌పేట్‌లో హోలీ ఆడుతున్న యువకులు

కబేళాకు తరలిస్తున్న 23 ఆవులు పట్టివేత



బొలెరోలో కబేళాకు తరలిస్తున్న ఆవులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 24 : ఆవులను అక్రమంగా కబేళాకు తరలిస్తున్న వాహనాన్ని గోరక్ష దళ్ సభ్యులు అడ్డుకొని ఘట్‌కేసర్ పోలీసులకు అప్పగించారు. ఎస్సై ఎ.శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. బొలెరో వాహనంలో అక్రమంగా 23 ఆవులను తరలిస్తుండగా ఆదివారం గోరక్షదళ్ సభ్యులు ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలోని యంనంపేట్ చౌరస్తా వద్ద అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని బొలెరో వాహనంలోని హేమంత్, కార్తీక్‌లను విచారించగా.. ఏపీలోని కాకినాడ జిల్లా తుని నుంచి 16 ఆవులు, 7 ఎడ్లను నగరంలోని బహదూర్‌పుర కబేళాకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆవులు, ఎడ్లను జియాగూడలోని గోశాలకు తరలించారు. కార్తీక్, హేమంత్‌లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వాహనంలో ఆవులను కుక్కి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గోరక్ష దళ్ సభ్యులు శ్రీధర్, పవన్‌కుమార్, కాలుసింగ్, సునీల్‌నాయక్, అనిల్‌రెడ్డిలు డిమాండ్ చేశారు.



కంకర తేలిన బొంరెడ్డిపల్లి వెళ్లే రోడ్డు

నత్తనడకన బీటీ పనులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కులకచర్ల, మార్చి 24 : మండలంలోని బొంరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై కంకరవేసి బీటీ వేయకపోవడంతో పాంబండ గిరిప్రదక్షిణలో పాల్గొంటున్న భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాంబండ బీటీ రోడ్డు నుంచి బొంరెడ్డిపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటీ రూ.20 లక్షలు నిధులు విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పాలకులు, అధికారులు హడావుడిగా పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ కంకర వేసి వదిలేశారు. ప్రతీనెల పౌర్ణమి రోజున పాంబండ గిరి ప్రదక్షిణ హిందు బంధువుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బొంరెడ్డిపల్లికి వెళ్లే రోడ్డు పాంబండ చుట్టూ ఉంటుంది. గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులు బొంరెడ్డిపల్లికి వెళ్లేదారిలో వేసిన కంకరపై నడవాల్సిన పరిస్థితి నెలకొంది. తేలిన కంకరపై పాదరక్షలు లేకుండా నడుస్తుండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. బీటీ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యూహం సిద్ధం!

ఎన్నికల కదన రంగంలోకి పార్టీలు

మరో నెలన్నర రోజుల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్రధాన పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మాల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా పార్టీలు సమావేశాలు నిర్వహిస్తూ తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో మంతనాలు సాగిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తున్నాయి. ఈ రెండు స్థానాల్లో గెలుపును మూడు పార్టీలూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇప్పటి నుంచే ప్రచారం, ఎదుటి పార్టీల్లో అసమ్మతి నేతలపై దృష్టిపెట్టడం, తమ ప్రభుత్వాలు చేసిన ప్రజాహిత కార్యక్రమాలపై ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి.

- అభ్యర్థుల ఖరారుతో వేగంగా ప్రచారం
- ప్రత్యర్థి పార్టీల్లో అసమ్మతులపై ప్రధానంగా గురి
- చేవెళ్ల, మల్కాజిగిరిల్లో నెలకొన్న త్రిముఖ పోటీ

చేవెళ్ల అభ్యర్థులు



రంజిత్‌రెడ్డి
కాసాని జ్ఞానేశ్వర్
కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికలకు ప్రధాన రాజకీయ పార్టీలన్నీ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఉమ్మడి జిల్లా పరిధిలోని రెండు లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసిన పార్టీలు పూర్తిస్థాయిలో ఎన్నికల కదనరంగంలోకి దిగాయి. క్షేత్రస్థాయిలో నియోజకవర్గ, మండల స్థాయిల్లో కేడర్‌ను సమాయత్తం చేస్తున్నాయి. స్థానిక నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాలతో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీల్లోని అసమ్మతి నాయకులను తమవైపునకు తెచ్చుకునే యత్నం చేస్తున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉండడంతో ఇప్పటి నుంచే వ్యూహాత్మకంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. అన్ని పార్టీలు సోషల్ మీడియా గ్రూపులు ఏర్పాటు చేసి తమ అభ్యర్థులు, నేతల ప్రచారాలను ఎప్పటికప్పుడు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్(ట్విటర్) తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో చేరవేస్తూ ఓటర్లను చేసుకునే యత్నం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలకు మే 13న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలోని కీలకమైన ఈ రెండు నియోజకవర్గాలను దక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు పోటీపడుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల తరువాత మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా చేవెళ్ల, మల్కాజిగిరిల్లో త్రిముఖ పోటీ నెలకొంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను పరిశీలిస్తే రెండు స్థానాల్లో బీఆర్ఎస్‌కు గణనీయమైన ఆధిక్యత స్పష్టంగా కన్పిస్తోంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రాజకీయ పరిస్థితులు ఒక్కసారిగా మారాయి. బీఆర్ఎస్ పరిస్థితి రోజురోజుకూ తీసికట్టుగా తయారవుతోంది. ఆ పార్టీలోని కీలక నేతలంతా అధికార పార్టీలో చేరేందుకు క్యూ కడుతున్నారు. ఉమ్మడి జిల్లా రాజకీయాలను శాసించిన కొందరు నేతలు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరగా మరికొందరు రానున్న ఎన్నికల్లోగా కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధం అయ్యారు. ఇప్పటికే వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జడ్పీ చైర్‌పర్సన్లు, చేవెళ్ల ఎంపీ, ఓ మాజీ మంత్రి కాంగ్రెస్‌లో చేరారు. వీరిలో చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి కాంగ్రెస్ చేవెళ్ల లోక్‌సభ టికెట్ సీటు ఖరారైంది. వికారాబాద్ జడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డికి మల్కాజిగిరి సీటు కేటాయించారు. అయితే రంజిత్‌రెడ్డి పార్టీలో చేరకముందు సునీతారెడ్డికే చేవెళ్ల కేటాయిస్తారని అంతా భావించారు. ఈ మేరకు ఆమె నియోజకవర్గంలో ప్రచారాన్ని కూడా మొదలు పెట్టారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఈ సీటు ఆయనకే కేటాయించారు. ఈ విషయంలో సునీతారెడ్డి మనస్తాపం చెంది మల్కాజిగిరిలో పోటీకి నిరాకరించారు. పార్టీ నాయకత్వం బుజ్జగింపుల తరువాత ఆమె మల్కాజిగిరిలో పోటీకి ఒప్పుకున్నారు. దీంతో పాలక పార్టీ కాంగ్రెస్ అభ్యర్థులిద్దరూ చేవెళ్ల, మల్కాజిగిరిల్లో పూర్తిస్థాయిలో ప్రచార కార్యక్రమాలను మొదలుపెట్టారు.

మల్కాజిగిరి అభ్యర్థులు



సునీతారెడ్డి
రాగిడి లక్ష్మారెడ్డి
ఈటల రాజేందర్

ప్రచారంలో ముందున్న కమలదళం

ఇదిలా ఉంటే అందరికంటే ముందే టికెట్లు ఖరారు చేసిన బీజేపీ ప్రచారంలో దూసుకుపోతోంది. మల్కాజిగిరి నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్, చేవెళ్ల నుంచి ఇదే స్థానంలో ఎంపీగా పని చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని బీజేపీ బరిలో నిలిపింది. బీజేపీ ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేసింది. మిగతా రెండు పార్టీలతో పోలిస్తే బీజేపీకి క్యాడర్ తక్కువే ఉన్నా ఉన్నవారినే సమర్థంగా వాడుకుంటూ సభలు, అంతర్గత సమావేశాలతో పార్టీ విధానాన్ని ప్రజల్లోకి తీసుకుపోతోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తోంది. దేశానికి మరోసారి మోదీ అవసరం అంటూ నొక్కి చెబుతూ బీజేపీకి ఓటు వేయాలని కోరుతోంది. బీజేపీ శ్రేణులతో పాటు ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు ఈ రెండు స్థానాల్లో గెలుపు కోసం చాపకింద నీరులా పనిచేస్తున్నాయి. నాయకులు స్థానికంగానే బసచేస్తూ క్షేత్రస్థాయిలో ముమ్మర ప్రచారం చేస్తున్నాయి. కార్నర్ మీటింగ్‌లు, పాదయాత్రలు, పల్లెనిద్ర కార్యక్రమాలతో పార్టీని ప్రజల్లోకి తీసుకుపోతున్నారు.

ఎట్టకేలకు అభ్యర్థులను ఖరారు చేసిన బీఆర్ఎస్

ఇక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ చేవెళ్ల నుంచి రంగారెడ్డి జడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్‌ను బరిలో దింపింది. అలాగే మల్కాజిగిరి నుంచి సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పేరు ఖరారు చేసింది. ఈ స్థానం నుంచి మొదట ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు టికెటిస్తారని ప్రచారం జరిగింది. చివరి నిమిషంలో ఇక్కడ అభ్యర్థిని మార్చారు. బీఆర్ఎస్ కూడా రెండు స్థానాల్లో ప్రచారాన్ని మొదలు పెట్టింది. రెండు లోక్‌సభ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నేతలతో అభ్యర్థులు ఇప్పటికే సమావేశాన్ని నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అయితే నిన్నమొన్నటి వరకూ గెలుపై ధీమాతో ఉన్న బీఆర్ఎస్‌కు రోజుకో దెబ్బతగులుతోంది. పార్టీ ముఖ్యనేతలంతా ఒక్కొక్కరుగా పార్టీని వీడిచి కాంగ్రెస్‌లో చేరుతుండడంతో ఆ పార్టీ ప్రచారంపై ప్రభావం పడుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొందరు ఇప్పటికే అధికార పార్టీకి దగ్గరయ్యారు. మరి కొందరు బయటపడకున్నా బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కొద్ది రోజుల్లో నగర శివారుల్లోని నియోజకవర్గాల ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది కాంగ్రెస్‌లో చేరుతారంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. కొన్ని రోజుల క్రితం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఇంకా మరికొందరు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు. అయితే ఇటీవల బీఆర్ఎస్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ తాను బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదన్నారు. పార్టీ ఇప్పుడు కష్టాల్లో ఉందని, ఈ సమయంలో పార్టీ అధినేత కేసీఆర్‌కు మనమంతా అండగా ఉండాలంటూ పేర్కొన్నారు. అయితే పార్టీ మారకుండా ఉండే నేతలు ఎంత మంది అనేది రానున్న రోజుల్లో తేలనుంది.

రూ.5.81 లక్షలు స్వాధీనం




పట్టుబడిన నగదును చూపిస్తున్న కరన్‌కోట్ ఎస్సై విఠల్‌రెడ్డి

తాండూరురూరల్/కొడంగల్ రూరల్, మార్చి 24 : వేర్వేరు చోట్ల నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు రూ.5.81లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కరన్‌కోట్ ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తాండూరు సీసీఐ కాలనీకి చెందిన మహ్మద్ అనాజ్ అనే వ్యక్తి ఆదివారం తాండూరు నుంచి గౌతాపూర్ వైపు స్కూటీపై వెళ్తున్నాడు. గౌతాపూర్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించగా అతడి వద్ద రూ.2,93,830 నగదును గుర్తించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా కొడంగల్ మండలంలోని కస్తూర్‌పల్లి చెక్‌పోస్టులో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా రూ.2లక్షల 88వేలు పట్టుబడటంతో సీజ్ చేసినట్లు ఎస్సై భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో రూ.50వేల కంటే ఎక్కువగా తీసుకెళ్తూ పట్టుబడితే వివరాలు చూపించాల్సి ఉంటుందని, లేనిపక్షంలో సీజ్ చేస్తామన్నారు.

పాఠశాలలో సోలార్ సిస్టం ఏర్పాటు

మర్పల్లి, మార్చి 24: మండలంలోని తమ్ములపల్లి ప్రాథమిక పాఠశాలకు సిరో ఫార్మసీ లిమిటెడ్ కంపెనీ రూ.5లక్షల 50వేలతో సోలార్ సిస్టం ఏర్పాటు చేశారు. కొంతకాలంగా విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి చెందిన పలువురు కంపెనీ దృష్టికి తీసుకెళ్లగా.. సోలార్ సిస్టం ఏర్పాటుచేసి విద్యుత్ సమస్యను పరిష్కరించారు. దాంతో కంపెనీ హెచ్‌ఆర్ స్రవంతి వేణుగౌడ్‌ను ఆదివారం గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులు ఇబ్బందులు పడకుండా సోలార్ సిస్టం ఏర్పాటు చేసినట్లు స్రవంతి తెలిపారు.



తర్జనభర్జన!

- మేడ్చల్ బీఆర్ఎస్‌లో నిశ్శబ్ద ఛాయలు
- 'పార్టీ చోడో అభియాన్'పై నాయకుల మీమాంస
- ఏకాకిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి?

మేడ్చల్ టౌన్, మార్చి 24 : మేడ్చల్ బీఆర్ఎస్‌లో నాయకుల మధ్య సయోధ్య లేకపోవడంతో అసలు పార్టీలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే మల్లారెడ్డి తీరు స్థానిక నాయకులకు, కార్యకర్తలకు అర్థంకావడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు అంతా తానై పార్టీని ముందుకు నడిపిన మల్లారెడ్డి పోకడ.. ప్రస్తుతం అందుకు భిన్నంగా ఉంది. పవర్ ఎటుంటే తాను అటుంటానని పరోక్షంగా నాయకులకు, కార్యకర్తలకు మల్లారెడ్డి సంకేతాలు పంపుతుండటంతో బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీలో కొనసాగాలా? వద్దా? అనే మీమాంసలో ఉన్నారు. మేడ్చల్‌లో బీఆర్ఎస్ నాయకులకు మల్లారెడ్డి వంటి నేత దొరకటం ఒక వరంలా భావించినా.. ప్రస్తుతం ఆయనే శాపంలా మారినట్లు కొందరు నాయకులు బాహాటంగానే చెబుతున్నారు. తాను పార్ట్‌టైం పొలిటీషియన్-ఫుల్‌టైం బిజినెస్‌మ్యాన్‌ను అని సన్నిహితులతో చెప్పడంతో ఇన్నాళ్లు ఆయన్ను నమ్ముకున్న నాయకులు ఎటూ తేల్చుకోలేని గందరగోళంలో ఉన్నారు. ఉద్యమకాలం నాటి నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న బీఆర్ఎస్ నేతలు.. ఆదినుంచీ మల్లారెడ్డిని ప్యారాచూట్ లీడర్‌గా భావించారు తప్పా.. తమతో పాటు ఉద్యమాలు చేసిన నేతగా భావించలేదు. పరిస్థితులను బట్టి ఆయన పార్టీలోకి వచ్చారే తప్ప.. ప్రజాసంక్షేమం కోసం మాత్రం కాదన్న భావన బీఆర్ఎస్ నేతల్లో పాతుకుపోయింది. ఆయన ఎప్పుడైనా పార్టీ వీడవచ్చన్న నమ్మకం బీఆర్ఎస్ నేతల్లో బలంగా ఉంది. దాంతో చాలామంది నేతలు ఈ మధ్య కాలంలో ఎమ్మెల్యేను కలవటానికి కూడా ఇష్టపడటం లేదు. ఇటీవల మల్లారెడ్డి శుభకార్యాలకు హాజరైనా స్వాగతం పలకటానికి నాయకులు, కార్యకర్తలు వెళ్లడం లేదు.

ఆచితూచి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్

ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరటానికి చాలామంది ముందుకు వస్తున్నప్పటికీ.. కాంగ్రెస్ నేతలు మాత్రం ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి అనుచరులు, దగ్గరి సంబంధాలు ఉన్న నాయకులకు కాంగ్రెస్‌లో చేరే అవకాశం కల్పించటంలేదని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ ఇటీవల బహిరంగంగానే చెప్పారు. ఆయన మాటలు పార్టీలో చేరేవారిని మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని కాంగ్రెస్ నేతలు.. మల్లారెడ్డి, ఆయన అనుచరులను పార్టీలో చేర్చుకునేందుకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ మల్లారెడ్డికి కాంగ్రెస్‌లో చేరటానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చిందంటూ పెద్దఎత్తున ప్రచారం కొనసాగుతోంది. అయితే, ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు మాత్రం ఖండిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మల్లారెడ్డి, ఆయన అనుచరులు.. తాము వద్దన్నా పార్టీ జెండా మోసేందుకు సిద్ధమౌతున్నారని, వారికి అంత తొందరగా చాన్స్ ఇవ్వబోమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు తేల్చి చెబుతున్నారు.

సొంత ప్రయోజనాలకే పరిమితమైన మల్లారెడ్డి

మల్లారెడ్డి సొంత ప్రయోజనాల కోసమే రాజకీయాల్లోకి వచ్చారన్న ప్రచారం ఊపందుకుంది. ఆయనతో పాటు టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లోకి వచ్చిన నాయకులు తలోదారి చూసుకుంటున్నారు. మల్లారెడ్డిని అధికార కాంగ్రెస్ పెద్దలు టార్గెట్ చేసిన నేపథ్యంలో.. అనుచరులు చాలామంది ఎమ్మెల్యేతో ఎంతదూరంగా ఉంటే అంత మంచిదని భావిస్తున్నారు. ఇప్పటికే ముఖ్యఅనుచరులుగా ముద్రపడటంతో అధికార పార్టీ నేతలతో అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని కొందరు నాయకులు తలలు పట్టుకుంటున్నారు. పలువురు బీఆర్ఎస్ నేతలు తమ రాజకీయ భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నారు. మరికొందరు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు.

భానుడి భగభగ..

- మధ్యాహ్నానికే రోడ్లపై కర్ఫ్యూ వాతావరణం

బషీరాబాద్, మార్చి 24: రోజురోజుకూ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల కారణంగా జనం ఇబ్బందులు పడుతున్నారు. మార్చిలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో మధ్యాహ్నం వేళ ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. మండలంలోని నవాల్గ, ఎక్మాయి, క్యాద్గీరా, మాసన్‌పల్లి, కొర్విచెడ్ తదితర ప్రాంతాల్లో నాపరాళ్ల గనులు విస్తరించి ఉండటంతో ఎండలు మరింత భగ్గుమంటున్నాయి. ఉదయం 11 గంటలకే నిప్పుల కొలిమిలా మండుతున్న ఎండ వేడిమితో జనసంచారం లేక బషీరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డు సాయంత్రం వరకు బోసిపోయి కనిపిస్తోంది. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న కేంద్రాల్లో మధ్యాహ్నం తర్వాత పాఠశాలలు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఎండలోనే తరగతులకు హాజరవుతున్నారు.



ఎండ వేడిమికి తలపై చున్నీ కప్పుకుని వెళ్తున్న విద్యార్థినులు

కనుల పండువగా మట్టల ఆదివారం



తాండూరు రూరల్, మార్చి 24 : మండలంలోని అంతారం మెథడిస్ట్ చర్చిలో క్రైస్తవులు ఆదివారం మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. పాస్టర్, సంఘ కాపరి రెవరెండ్ పి.భాస్కర్ స్త్రీ, పురుషులు, చిన్నారులు, కమిటీ సభ్యులు పాటలు పాడుతూ దేవుడి సువార్త ప్రకటిస్తూ మట్టలతో ఊరేగింపు నిర్వహించారు. మట్టల పండుగను గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం నిర్వహిస్తారు.

రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌కు సన్మానం

కొడంగల్ రూరల్, మార్చి 24: తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. వారు ఆదివారం కొడంగల్‌లో గురునాథ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వెంకటయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మీనాయక్, దుబ్బ భీమ్‌రెడ్డి, ఆకుల మల్లికార్జున్, దుప్‌చర్ల శేఖర్, చింతకింది రాజు, పి.అంజిలప్ప, బుర్రి కిష్టప్ప, రాంచందర్, కంతి చంద్రప్ప, చింతకింది నర్సింహులు, మాల రాములు, నర్సింహులు పాల్గొన్నారు.


గురునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న టేకుల్‌కోడ్ గ్రామ కాంగ్రెస్ నాయకులు

రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన


కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొడంగల్, మార్చి 24: వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్ఐ భరత్‌రెడ్డి ఆదివారం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత తదితర వాటిపై సలహాలు, సూచనలు చేశారు. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెటరన్స్ క్రికెట్ రన్నరప్ రంగారెడ్డి రాయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (వీసీఏటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్టర్స్ ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్)లో రంగారెడ్డి రాయల్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం అజీజ్‌నగర్‌లో జరిగిన ఎంపీఎల్ ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 5 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. ఛేదనలో రంగారెడ్డి రాయల్స్ 7 వికెట్లు కోల్పోయి 119 పరుగులే చేసి పరాజయం పాలైంది. విజేత, రన్నరప్ జట్లకు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు ట్రోఫీలను, నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెటరన్ క్రికెటర్లు వర్ధమాన, యువ క్రికెటర్లకు స్ఫూర్తిప్రదాతలని కొనియాడారు. ఎండ, వయసును లెక్క చేయకుండా పోటాపోటీగా ఆడిన ఇరుజట్ల క్రికెటర్లను అభినందించారు. కార్యక్రమంలో వీసీఏటీ వ్యవస్థాపక సభ్యుడు కన్నన్, సురేంద్ర అగర్వాల్, ఎస్పీవై రెడ్డి, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ ప్రదానం చేస్తున్న జగన్‌మోహన్

'ప్రజాపాలన'లో అన్ని వర్గాలకు సమన్యాయం

ఆమనగల్లు, మార్చి 24: కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పేదలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యేను నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు చెప్పారు. నల్లవారి పల్లి గ్రామానికి బీటీ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించేలా చూడాలని గ్రామ కాంగ్రెస్ నాయకురాలు ఇటికాల జయమ్మ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. నాయకులు యాదయ్య, శంకర్, మోతిలాల్, పర్వత్‌రెడ్డి, శేఖర్, రామస్వామి, చంద్రయ్య, మల్లేశ్, తదితరులున్నారు.


ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నల్లవారిపల్లి గ్రామస్తులు


కార్యక్రమంలో పాల్గొన్న పద్మజారాణి, రియాజ్, ఉమ, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

సైనిక్, మిలటరీ స్కూళ్లు.. దేశ మనుగడకు దోహదం

▸ డీఆర్డీవో పద్మజా రాణి

కీసర రూరల్, మార్చి 24 : దేశ మనుగడకు సైనిక్, రాష్ట్రీయ మిలటరీ స్కూళ్లు ఎంతగానో దోహదపడతాయని గ్రామీణాభివృద్ధి శాఖ కామారెడ్డి జిల్లా అధికారి పద్మజారాణి అన్నారు. ఆదివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని క్రాంతికీన్ పాఠశాలలో విన్నర్ మీట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీసీసీ అధికార ప్రతి ప్రతినిధి డాక్టర్ రియాజ్, ఎన్‌సీఈఆర్టీ సభ్యురాలు ఉమ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రాంతికీన్ స్కూల్ నుంచి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వారు జ్ఞాపికలు అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ సైనిక్, రాష్ట్రీయ మిలటరీ స్కూళ్లలో విద్యనభ్యసించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. దేశ ప్రగతి, భద్రతలో వారు భాగస్వాములు కావటంతో చరితార్థులు అవుతారని అన్నారు. సైనిక్, రాష్ట్రీయ మిలటరీ పాఠశాలల్లో ప్రవేశం పొందేందుకు ఉత్తమమైన శిక్షణ ఇస్తున్న క్రాంతికీన్ పాఠశాల యాజమాన్యాన్ని వారు అభినందించారు. పాఠశాల కరెస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కళ్యాణి, గ్రేటర్ కాలేజ్ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ వెంకటేష్, బోధనా సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


వినతి త్రపం ఇస్తున్న కాటికాపర్ల సంఘం నాయకులు

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, మార్చి 24 : కుల వృత్తినే నమ్ముకున్న మాల బ్యాగరి కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎత్తపు కేశవులు కోరారు. ఆదివారం ఆ సంఘం నేతలతో కలిసి నగరంలోని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ మల్లు రవి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం వారి సమస్యలపై ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ మాలబ్యాగరి కాటికాపర్ల సమస్యలను కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపర్చాలని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శ్మశానవాటికల్లో సేవలందిస్తున్న తమ సమస్యలపై పాలకులు నేటికి నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటికల్లో మౌలిక వసతులను కల్పించి ప్రతి నెల రూ.25వేలు వేతనంగా ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కాటికాపరులకు హెల్త్ కార్డు, జీవిత భీమా ద్వార రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా వచ్చేల కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గాదె సత్తయ్య, నాయకులు జి.శేఖర్, కె.గణేష్, కె.నాగరాజు, బి.సురేందర్, బి.రాజు, జి.సుధాకర్, టి.నర్సింహ, కె.మోహన్, పాల్గొన్నారు.


ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వెంకటేశ్, నాయకులు

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

▸ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు బీజేపీ, కాంగ్రెస్ కుట్ర రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం సాయంత్రం ప్రవీణ్‌కుమార్ పర్యటించారు. తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌తో కలిసి ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్ నాయకులతో సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నాయకులతో చర్చించారు. బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు వ్యూహాత్మకంగా ముందుకుసాగాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ప్రమాదమన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్‌ను ఆదరించి గెలిపించాలని కోరారు. తనను ఆదరించి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నాయకులు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, దుద్దు ఆంజనేయులు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ట్యాంకర్ల ద్వారా కర్ణాటక నుంచి డీజిల్ సరఫరా



మర్పల్లి, మార్చి 24: మర్పల్లి మండలం కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో సంగారెడ్డి, హైదరాబాద్‌కు చెందిన పలువురు కొంత కాలం నుంచి అక్రమంగా డీజిల్‌ను సరఫరా చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కంటే కర్ణాటకలో డీజిల్ దర తక్కువగా ఉండటంతో మర్పల్లి మీదుగా కర్ణాటక రాష్ట్రం కుంచారం గ్రామం నుంచి దర్జాగా ప్రతీరోజు పదుల సంఖ్యలో అక్రమంగా డీజిల్ ట్యాంకర్‌లను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు అక్రమార్కులు పెద్ద ట్యాంకర్‌ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో సరిహద్దు ప్రాంతాల యజమానులు ఇతర ప్రాంతాల నుంచి డీజిల్ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొంచిఉన్న ప్రమాదాలు!

▸ ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు
▸ డీలాపడిన ఎల్టీ 11 కేవీ వెర్లు.. సరి చేయని విద్యుత్ సిబ్బంది
▸ ఇళ్లమధ్యనే ట్రాన్స్‌ఫార్మర్లు పట్టని అధికారులు


ఇంటికి ఆనుకొని ఉన్న స్తంభం, ఎల్టీ వైర్లు


చిన్నతూండ్లలో ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

యాచారం, మార్చి 24: యాచారం మండలంలోని వివిధ గ్రామాలలో ఎల్టీ, 11కేవీ విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. చాలా చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. విద్యుత్ సమస్యలపై మండల సర్వసభ్యసమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తెచ్చినా సమస్యను తీర్చిన దాఖలాలు లేవు. చిన్నతూండ్లలో 20 రోజుల క్రితం ఇళ్ల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బంచ్ కేబుల్ తెగిపోయింది. స్థానికుడు రాములు గమనించి ఉండకపోతే నల్గురు విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసేవి. ఇదే గ్రామంలో ఇంటికి ఆనుకొని ఉన్న ఎల్టీవైర్ తగిలి ఆరేళ్లక్రితం నర్సింహ అనే వ్యక్తి దుర్మరణం చెందారు. స్తంభం తొలగిస్తామని అప్పట్లో ట్రాన్స్‌కో అధికారులు చెప్పడమే గానీ ఇంత వరకూ తొలగించలేదు. గ్రామాల్లో పలు చోట్ల ఇళ్లకు అనుకుని ఆనుకొని ఎల్టీ వైర్లున్నాయి. వాటిని సరి చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడంల లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మినరల్ వాటర్ భవనంపై, గ్రామపంచాయతీ భవనంపై నుంచి ఎల్టీ వైర్లను తొలగించాలని ట్రాన్స్‌కో అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. తాటిపర్తిలో ఇండ్లకు ఆనుకొని ఎల్టీ వైర్లున్నా వాటిని సరిచేయడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నందివనపర్తిలో పలు చోట్ల ఎల్టీ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిని తొలగించాలని పలు మార్లు పంచాయతీ సిబ్బంది అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. చౌదర్‌పల్లిలో పలు చోట్ల ఎల్టీ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. మంగలి జగాల్, జైతారం చంద్రయ్య, కొంగరి జంగయ్యల ఇళ్ల సమీపంలో ఎల్టీ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. నజ్దిక్‌సింగారంలో రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచేలేకపోవడంతో ఆవు చనిపోయింది. దీంతో రైతు సొంత డబ్బులతో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ వేశారు. పలు వీధుల్లో ఎల్టీ లైన్లు డీలాగా ఉన్నాయి. నందివనపర్తిలో 11కేవీ వైర్ల కింద ఎల్టీ లైన్లకు కర్ర సాయంతో వెర్లను బిగించారు. అంతేకాకుండా గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకుండా పోయాయి. మంతన్‌గౌరెల్లి, అయ్యవారిగూడ, కొత్తపల్లి, మాల్ తదితర గ్రామాల్లో ఎల్టీ లైన్లపరిస్థితి దయనీయంగా ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డీలాగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.


నజ్దిక్‌సింగారంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

స్తంభం తొలగించాలి



ఇంటిపైన ఉన్న ఎల్టీ వైర్‌ను తొలగించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఈ వెర్లు తాకడంతో నా భర్త నర్సింహ చనిపోయాడు. అయినా అధికారులు సరిచేయడం లేదు. గ్రామంలో ఏ వీధిలో చూసినా వైర్లు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి.

యశమోని కళమ్మ చిన్నతూండ్ల

మా దృష్టికి వచ్చిన సమస్యను తీరుస్తున్నా



చిన్నతూండ్ల, చౌదర్ పల్లి, తాటిపర్తి, నజ్దిక్‌సింగారం, నందివనపర్తి తదితర గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న ఎల్టీ వైర్లను, 11 కేవీ వైర్లను సరి చేశాం. కొద్ది రోజుల క్రితం కొత్తపల్లిలో నాలుగు స్తంభాలు వేసి ఎల్టీ, 11కేవీ వైర్లను సరిచేశాం. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూస్తున్నాం విద్యుత్ సమస్యలను నాదృష్టికి తెస్తే పరిష్కరిస్తాను.

సందీప్‌కుమార్, యాచారం ట్రాన్స్‌కో ఏఈ

ఆటో డ్రైవర్‌ను చితక బాదిన వడ్డీవ్యాపారిని శిక్షించాలి

తెలంగాణ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దయానంద్

హైదరాబాద్, మార్చి24 (ఆంధ్రజ్యోతి):- వికారాబాద్ జిల్లా తాండూరులో వడ్డీ డబ్బులు చెల్లించలేదనే కారణంతో ఆటో డ్రైవర్‌ను ఇంటికి పిలిచి చితక బాదిన మ్యాదరి రవిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దయానంద్ డిమాండ్ చేశారు. ఇప్పటికే రవాణారంగంపైఆధారపడిన ఆటో డ్రైవర్లకు ఆదాయం లేక కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆయనపేర్కొన్నారు.మహాలక్ష్మిమహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంతో అంతంత మాత్రంగా ఉన్న ఆటో డ్రైవర్ల ఆదాయం మొత్తానికి మొత్తం తగ్గిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కుటుంబ అవసరాలకు రాజీవ్‌కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ బాలయ్య తాండూరు పట్టణం గాంధీనగర్‌కు చెందిన మ్యాదరి రవి వద్ద మూడునెలల క్రితం 5వేలు అప్పుతీసుకున్నారన్నారు. సకాలంలో వడ్డీతో సహా మొత్తం చెల్లించలేదనే కారణంతో ఇంటికి పిలిచి లాఠీతో చితక బాదుతూ మరో వైపు పిడిగుద్దులతో మానవత్వాన్ని మరిచి తీవ్రంగా హింసించిన సంఘటనలు సామాజిక మాధ్యంలో వైరల్ అయిన దృశ్యాలు ప్రతి ఒక్కరినీ కదిలించాయని పేర్కొన్నారు. పేద ఆటో డ్రైవర్‌లపైపాశవిక దాడికి పాల్పడిన వడ్డీ వ్యాపారి రవిని తక్షణం అరెస్టు చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని దయానంద్‌కోరారు. గ్రేటర్‌పరిధిలో సైతం వడ్డీ వ్యాపారులు, ఫైనాన్సర్‌లు ఆటో లను బలవంతంగా లాక్కుని వెళ్లి దాడులకు పాల్పడుతున్న సంఘటనలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

మనోనిబ్బరంతో పనిచేయాలి

▸ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి సునీతను గెలిపించాలి
▸ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పిలుపు


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

శామీర్‌పేట, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికల పోరులో కాంగ్రెస్ కార్యకర్తలు రాత్రింబవళ్లు మనోనిబ్బరంతో పనిచేసి మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వ్యవసాయశాఖ మంత్రి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల నాగేశ్వర్‌రావు పిలుపు నిచ్చారు. ఆదివారం శామీర్‌పేట మండలం తూంకుంటలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, మేడ్చల్ నియోజవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొంది రికార్డును సృష్టించారని గుర్తుచేశారు. ఈసారి ఎన్నికల్లో కూడా ఎంపీ అభ్యర్థి పట్నం సునీతను గెలిపించి మరోసారి రికార్డును సృష్టించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి సునీతను భారీ మెజార్టీతో గెలిపించి మల్కాజ్‌గిరి సీటును రాహుల్‌గాంధీకి కానుకగా అందించాలన్నారు. రాష్ట్రంలోని 14 పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేలా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి కేసీఆర్ పాలనను తుంగలో తొక్కి ప్రజలకు ఉత్తమ పాలన అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దడం ఖాయమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అంతులేని అక్రమాలు, కుంభకోణాలన్నీ బయటపడుతున్నాయని, వాటిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు చిత్తుగా ఓడిపోయి భూస్థాపితం కావడం ఖాయమని ఛాలెంజ్ చేశారు. తన గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేసి సత్తా చాటాలని కోరారు. ఎన్నికల్లో పని చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపునిస్తామన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, సుధీర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, నవీన్‌చందర్‌రెడ్డి లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాల అధ్యక్షులు, వైఎస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మొగుళ్ల శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బాలేష్, మధుసూదన్‌రెడ్డి, ఎద్దు నాగేశ్‌యాదవ్, ముజీబుద్దీన్, కిశోర్‌యాదవ్, లక్ష్మారెడ్డి, మేడ్చల్, కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరుపయోగంగా యూత్ కమ్యూనిటీ హాల్

▸ ఐదేళ్ల క్రితం అట్టహాసంగా ప్రారంభం
▸ నేడు శిథిలావస్థకు చేరుకున్న బిల్డింగ్


కంకల్‌లో శిథిలావస్థకు చేరుకున్న కమ్యూనిటీ హాల్

పూడూరు, మార్చి 24 : మండలంలోని కంకల్‌లో నిర్మించిన యూత్ భవనం, కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా మారాయి. ఐదేళ్ల క్రితం ఎంపీ నిధులు రూ.16లక్షలతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారు. ఈ భవన నిర్మాణం పూర్తిచేసి 2-3-2019లో ఎంతో ఆర్భాటంగా ప్రారంభోత్సవం చేశారు. అప్పట్లో కమ్యూనిటీ హాల్‌ను సభలు, సమావేశాలకు బాగానే ఉపయోగించారు. రానురాను ఎవరూ పట్టించుకోకపోవడంతో కమ్యూనిటీ హాల్ కాస్త శిథిలావస్థకు చేరుకుంది. హాల్ నిర్మాణంలో భాగంగా వేసిన రేకులు విరిగిపోయి. అక్కడక్కడ గోడలు కూడా బీటలు వారాయి. దాంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు మరమ్మతులు చేయించి కమ్యూనిటీ హాల్‌ను అందుబాటులోకి తెస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.


2019లో ప్రారంభోత్సవం చేసిన శిలాఫలకం

కమ్యూనిటీ హాల్‌కు మరమ్మతులు చేయాలి



గ్రామంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ గతంలో ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రస్తుతం వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటుంది. ఏ సమావేశం నిర్వహించినా కమ్యూనిటీ హాల్‌ను ఉపయోగించుకునేవారు. ప్రస్తుతం అవకాశం లేకుండా పోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు కమ్యూనిటీ హాల్‌కు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలి.

- ఎండీ అన్వర్, కంకల్ గ్రామం


ఎంపీపీ ఖాజా ఇద్రిష్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కాంగ్రెస్‌లో చేరిన ఫరూఖ్‌నగర్ ఎంపీపీ

షాద్‌నగర్ అర్బన్, మార్చి 24 : షాద్‌నగర్ బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. ఫరూఖ్‌నగర్ ఎంపీపీ ఖాజా ఇద్రిష్ అహ్మద్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాసంలో పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఇద్రిష్‌ను ఆహ్వానించారు. అలాగే ఇద్రిష్ సొంత గ్రామం చౌలపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్, మాజీ వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తాము చితశుద్దితో పనిచేసినా.. మైనార్టీలు పనిచేయలేదని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ వ్యాఖ్యానించడం, బీఆర్ఎస్ నిర్వహిస్తున్న సమావేశాలకు సమాచారం ఇవ్వకపోవడంతో తాను మానసిక వేదనకు గురయ్యానని ఇద్రిష్ తెలిపారు. ఎంపీపీగా గ్రామాల అభివృద్ధి దృష్టిలో పెట్టుకుని అధికార పార్టీలో చేరినట్టు చెప్పారు. కాగా, ఆయన పార్టీలోకి రావడం సంతోషమని, సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిల విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని శంకర్ కోరారు. కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ జడ్పీటీసీ సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డి, షాద్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.బాల్‌రాజ్‌గౌడ్, మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్

బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

కులకచర్ల, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికల్లో చేవేళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్ అన్నారు. చౌడాపూర్ మండల బీజేపీ ముఖ్య నాయకుల సమావేశాన్ని మండల అధ్యక్షుడు బందెయ్య ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. బూత్ కమిటీలను పూర్తిచేసి ప్రతీ బూత్‌లో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు వచ్చే విధంగా పనిచేయాలని తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీమెజార్టీతో గెలిపించి నరేంద్రమోదీకి కానుకగా పంపించాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త అబ్ కి బార్ మోదీ సర్కార్ అనే నినాదంతో ప్రతీబూత్ కార్యకర్తలు పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రామాంజనేయులు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు చిన్న మల్లికార్జున్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మానయ్య, సీనియర్ నాయకులు పురుషోత్తం, జనార్ధన్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటేశం, జిల్లా కార్యవర్గ సభ్యులు మహిపాల్, యువ మోర్చా మండల అధ్యక్షుడు శరత్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు పాండునాయక్, బూత్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ హోలీ శుభాకాంక్షలు



వికారాబాద్, మార్చి 24: వికలెక్టర్ సి. నారాయణరెడ్డి వికారాబాద్ జిల్లా ప్రజలకు ఒక ప్రకటనలో హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాగ ద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్క చోట చేర్చే ఈ హోలీ వేడుకను ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా జిల్లా ప్రజలు ఆనందోత్సవాలతో హోలీ వేడుక జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి: ఎస్పీ



ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, మార్చి 24: జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగ వేడుకలు జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



పెద్దేముల్‌లో ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, మార్చి 24 : యువకులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే బ్యాటింగ్ చేయగా కాంగ్రెస్ నాయకులు బౌలింగ్ చేశారు. అనంతరం యువతను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు గ్రామీణస్థాయి క్రీడల నుంచి జాతీయ స్థాయి వరకు ఎదగాలని కోరారు. అందుకు నిరంతర సాధన చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. యువత క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం అందేవిధంగా కృషి చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు నారాయణరెడ్డి, ఉప్పరి మల్లేశం, నాయకులు రుద్రారం మహిపాల్‌రెడ్డి, జితేందర్ రెడ్డి, కొమ్ము గోపాల్‌రెడ్డి, డివై.నర్సింహులు, హర్షవర్దన్‌రెడ్డి, మైపుస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బెల్కటూర్ వాసులు

తాండూరు రూరల్: తాండూరు మండలం బెల్కటూర్ గ్రామానికి చెందిన అంబేద్కర్ నగర్ ఎస్సీ కాలనీ వాసులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను కలిసి స్మశానవాటిక, కమ్యూనిటీ హాల్, రేణుక ఎల్లమ్మ ఆలయం పునఃనిర్మాణం తదితర సమస్యలపై వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకులంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇట్టి సమస్యలను ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లె నర్సింహులు, జెట్టపరి వెంకటేష్, మామిడిగళ్ల జెగ్గప్ప, జెట్టపరి సైప్ప, మాల నర్సప్ప, శామప్ప ఉన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

యాలాల: యాలాల గ్రామానికి చెందిన రాజు కుమారుడు వెంకట సాయి వివాహానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు డాక్టర్ సంపత్ కుమార్, జడ్పిటిసి సిద్రాల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మురళీకృష్ణగౌడ్, ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చిట్టంపల్లిలో రైతు ఆత్మహత్య

● భూ తగాదాలే కారణం



మృతుడు జంగయ్య

వికారాబాద్, మార్చి 24: తన పొలం తనకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని మనస్తాపం చెంది ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వికారాబాద్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి పల్లి జంగయ్య(45)కి వ్యవసాయ పొలం ఉంది. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే అవసరాల కొద్ది జంగయ్య భూమిని అదే గ్రామానికి చెందిన కుమ్మరిపల్లి నర్సింహులుకు (ఏజీపీఏ) చేసి ఇచాచడు. అట్టి భూమిని తిరిగి ఇవ్వాలని కోరగా ఇవ్వక పోవడంతో వారి మధ్య గొడవకు దారితీసింది. ఈ విషయమై పంచాయితీ పెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. పంచాయితీలో జంగయ్య పేరుపై చేసి ఇస్తామని చెప్పినా చేయకపోవడంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు వికారాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మాణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి గల్లంతు



నరేష్‌కుమార్

కీసర రూరల్, మార్చి 24: చెరువులో ఈతకు వెళ్లి ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. ఈ ఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలోని వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన నరేష్‌కుమార్(13సంవత్సరాలు) అనే బాలుడు నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని శాంతినికేతన్ పాఠశాలలో చదువుతున్నాడు. ఆదివారం సెలవు రోజు కావటంతో ఈత కొట్టేందుకు తన మిత్రులతో కలిసి వెళ్లాడు. తన ఇంటికి సమీపంలోని కొత్త చెరువుకులో దిగిన నరేష్‌కుమార్‌కు ఈత రాకపోవటంతో చెరువులో మునిగిపోయాడు. గమనించిన తోటిమిత్రులు స్థానికులకు తెలిపారు. వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడేటప్పటికీ గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది.

లైసెన్స్ లేని ఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్

తాండూరు: మార్చి 24: తాండూరులో ఎలాంటి లైసెన్సు లేకుండా ఫైనాన్స్, చిట్‌ఫండ్స్, వడ్డీ వ్యాపారం పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్, సీపీఎం జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ తాండూరులో రోజురోజుకు వడ్డీవ్యాపారులు, అక్రమ ఫైనాన్స్ సంస్థలు అనుమతి లేని చిట్‌ఫండ్స్ తదితర వ్యాపారులు అధిక వడ్డీలకు డబ్బులను ఇస్తూ భౌతికదాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార బలంతో, కండబలంతో చిరు వ్యాపారస్తులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న అలాంటి వ్యక్తులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు. అధిక వడ్డీల పేరుతో ప్రజలను పీడిస్తున్న వారిపై పీడీయాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ టౌన్ సెక్రటరీ మునీర్, రఘు, రవీందర్ పాల్గొన్నారు.

గెలుపుబాటలో అడ్డంకులకు భయపడొద్దు



ప్రారంభోత్సవంలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 24: గెలుపుబాటలో వచ్చే అడ్డంకులను చూసి క్రీడాకారులు బయపడొద్దని అనురాగ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఉట్ల బాలాజీ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆదివారం ప్రారంభమైన ప్రతిభ మేనేజ్‌మెంట్-2024 గేమ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములు సహజమని క్రీడాస్ఫూర్తితోట ముందుకు సాగాలని సూచించారు.

క్రీడలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు



జాతీయస్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు



టాస్‌వేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మారుతి కిరణ్ బూనేటి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 24: క్రీడలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల భారత దివ్యాంగుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేష్‌నాయక్ తెలిపారు. మండలంలోని ఘనాపూర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా సాగుతున్న కురుక్షేత్ర-2024 జాతీయ స్థాయి క్రీడాపోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలకు అవిటితనం అడ్డుకాదని తెలిపారు. చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుర్తుచేశారు. క్రీడావిభాగంలో ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. అనంతరం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ కొమ్మూరి దివ్య మాట్లాడుతూ క్రీడలతో ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. కురుక్షేత్ర క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లుకు ప్రశంస ప్రతాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వర్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మదన్‌మోహన్, ఫిజికల్ డైరెక్టర్ రంజిత్‌గౌడ్, ఎల్.రాణి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

పూడూరు: యువత క్రీడల్లో రాణించాలని బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతి కిరణ్ బూనేటి అన్నారు. మండలంలోని దేవనోనిగూడెం గ్రామయువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీపీఎల్-2 మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మారుతి కిరణ్ బూనేటి, చన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత విద్యార్థి స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల వల్ల స్నేహభావం పెరుగుతుందని, వారిలో దాగి ఉన్న ప్రతిభ వెలికితీసే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రిత్వశాఖ, కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు హరికృష్ణ, పరిగి మండల ప్రధాన కార్యదర్శి నర్సిం హ, బీజేపీ నాయకులు అనిల్‌కుమార్, ప్రకాష్, రమేష్, పాండు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం సొంతం



కొండాయిపల్లిలో మాట్లాడుతున్న ఆంజనేయరెడ్డి

దోమ, మార్చి 24: ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యం సొంతమవుతుందని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి తెలిపారు. మండలంలోని బట్లచందారం, కొండాయిపల్లి, బడెంపల్లి, గంజిపల్లి గ్రామాల్లో ఆదివారం ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. నిత్యజీవితంలో ఎదుర్కొనే ఒత్తిడి కారణంగా వస్తున్న బీపీ, షుగర్ వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. మాంసాహారం మాని ధాన్యం చేయడం వల్ల సత్ఫలితాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యుడు బాలకృష్ణారెడ్డి, చెన్నయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: నిత్యం ధ్యానం చేయడంతో జబ్బులు దరిచేరవని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. మండలంలోని చెల్లాపూర్ గ్రామంలో ఆదివారం ప్రజలకు ధ్యానంచేసే పద్ధతిపై అవగాహన కల్పించారు. నిత్యం ధ్యానం చేయడం ద్వారా గుండె జబ్బులు, బీపీ, షుగర్ వ్యాధులను, మోకాళ్ల నొప్పులను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధ్యాన ప్రచారకర్త నవీన్, పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



మేనిఫెస్టోను చూపుతున్న ప్రకాశ్ రెడ్డి

వికారాబాద్, మార్చి 24: ప్రజా సంక్షేమమే ధ్యేయమని చేవెళ్ల పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి ఈసరి సూర్య ప్రకాశ్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ లోని బసంత్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మ్యానిఫెస్టోను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మహేశ్వరం అభ్యర్థిగా పోటీ చేశానని ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంట్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నానని తెలిపారు. తనను గెలిపిస్తే పరిపాలన సంస్కరణలు, నాణ్యమైన విద్య, ఆధునాతనమైన గ్రామాలు, డీ అడిక్షన్ సెంటర్లు, ఆరోగ్య బీమా, రాజకీయ సంస్కరణలు, అవినీతి నిర్మూలన, సత్వర న్యాయం చేస్తానని తెలిపారు. తనను బలపర్చి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్, ఆదిత్య రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు పెంపుతో ఇబ్బందులు

వికారాబాద్, మార్చి 24: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తు ఫీజు పెంపుతో పేద, మధ్యతరగతి అభ్యర్థులపై భారం పడుతోందని రాష్ట్ర యువనాయకుడు గణపూరం శాంతి కుమార్ అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ టెట్ పేపర్ దరఖాస్తు ఫీజు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఫీజు ఉండేదన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం టెట్ పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు రూ.2వేల వరకు పెంచడం సరైంది కాదన్నారు. పరీక్ష ఫీజును తగ్గించడంతో పాటు 33 జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

ప్రాచీన విద్యలో రాణించడం అభినందనీయం



కర్రసాము ప్రదర్శనలో పాల్గొన్న యువకులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్ఐ

కొడంగల్, మార్చి 24: యువత ప్రాచీన విద్యలో రాణించడం అభినందనీయమని ఎస్ఐ భరత్‌రెడ్డి అన్నారు. అయోధ్యలో రెండు రోజుల కిందట కొడంగల్‌కు చెందిన రమేశ్ ఆధ్వర్యంలో కలారి(కర్రసాము) ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక రాఘవేంద్ర ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్రసాము ప్రదర్శనలో పాల్గొన్న వారికి వైద్యుడు రవీంద్ర యాదవ్, హిందూవాహిని సభ్యులు రాకేశ్, భాను, రవీందర్ నాయక్‌లతో కలిసి ఎస్ఐ ప్రశంసాపత్రాలు, అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో యువకులు చిన్న చిన్న తప్పిదాలకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అలాంటి వారికి భరోసా కల్పించాల్సిన అవసరముందన్నారు. దేశంలో ప్రాచీన విద్య తెలియని వారు ఎంతోమందికి తెలంగాణలోనే మొదటిసారిగా ఈ విద్యను నేర్చుకుని ఈ ప్రాంతానికి మంచిపేరు తీసుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోట్రిక లక్ష్మీనారాయణ గుప్త, సర్వేశ్, వెంకటయ్య, నవీన్ పాల్గొన్నారు.

మనుషులంతా సమానమని చెప్పిన

మహనీయుడు అంబేడ్కర్



ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రైల్వేశాఖ సీనియర్ ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు

ఘట్‌కేసర్, మార్చి 24: మనుషులంతా సమానమని చెప్పిన గొప్ప మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రైల్వే శాఖ సీనియర్ ఇంజనీర్ బోలపల్లి శ్రీనివాస్ అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో అట్టడుగు ప్రజలకు ఏమాత్రం హక్కులు లేని కాలంలో ఇది అన్యాయమని మనుషులంతా ఒక్కటేనని చెప్పిన అంబేడ్కర్ అందరికీ ఆదర్శమన్నారు. అనంతరం రాజ్యాంగ రచనలో కీలక భూమిక పోషించి అందరికి సమానహక్కులు కల్పించాడని తెలిపారు. నేటి తరం యువత మనకోసం మనమే అనుకోకుండా దేశం కోసం అట్టడుగు ప్రజల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. అందుకు అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనాడు ఆయన సంపాదనే ధ్యేయం అనుకుంటే ఏ సంపన్న దేశానికో వెళ్లి ఉద్యోగం చేసుకొని స్థిరపడే వారని అలా కాకుండా దేశంలో మార్పుకోసం శక్తినంతా ధారపోసిన గొప్పవ్యక్తుల్లో ఒకరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధులు మీసాల అరుణ్‌కుమార్, దాసు, భరత్, రాందాస్, అశోక్, నారాయణ, వెంకటేశ్వర్లు వెంకటస్వామి, మహేష్ పాల్గొన్నారు.

అంతారం ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామ భక్తుల కమిటీ సభ్యులు, నాయకులు

తాండూరు రూరల్, మార్చి 24: మండలంలోని అంతారం ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామ భక్తుల కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామస్తుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణానికి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మేస్త్రి నర్సింహులు, మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ వడ్డె శ్రీనివాస్, ఎంపీటీసీ శాంతు, విశ్రాంత ఉపాధ్యాయులు ఎల్లప్ప, సీహెచ్.లాలప్ప, కమిటీ సభ్యులు, పుల్ల ప్రభాకర్‌రెడ్డి, నల్లసంపత్, బాబర్, కురవ శ్రీనివాస్, రవి, అంజయ్య, ఉప్పరి నర్సింహులు, యాదప్ప, శేఖర్, కోటప్ప, అంజిల్‌రెడ్డి, అజంత హనుమాన్ కమిటీ సభ్యులు, భూమిపూజ చేసినట్లు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సహకరించారని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వికారాబాద్, మార్చి 28: పూర్వ విద్యార్థులు అందరూ ఒక చోట చేరి సందడి చేశారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను, తీపి గుర్తులను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. వికారాబాద్ నియోజకవర్గం మర్పల్లి మండలం కొత్లాపూర్ గ్రామం జడ్పీహెచ్ఎస్ పాఠశాల 10వ తరగతి 2008-09 విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆనాడు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సింహులు, ఉపాధ్యాయులు రాఘవేందర్, అంజయ్య, నర్సింహులు, అనిత, స్నేహలత, హైమావతి తోపాటు విద్యార్థులు దత్తేశ్వర్, రాచన్న, నాగేష్ బాబు, అంబేద్కర్, కృష్ణ, నవీన్ , పుల్లారెడ్డి, అరవింద్, లక్ష్మి, రాజేశ్వరి, స్వప్న, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాహనాల తనిఖీ



చౌడాపూర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కులకచర్ల, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కులకచర్ల పోలీసులు ముమ్మర వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం చౌడాపూర్ దగ్గర వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ప్రతీ ఒక్కరూ నిబంధనలను పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు, మద్యం తీసుకెళితే సీజ్ చేస్తామని ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు. వాహనాలకు సంబంధించిన అన్నీ పత్రాలను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జైపాల్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో వెలగని వీధిలైట్లు



అంధకారంగా రైతు వేదిక మార్గం

బషీరాబాద్, మార్చి 24: మండల కేంద్రంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన రోడ్లు పలు వార్డులో వీధిలైట్లు పూర్తిస్థాయిలో లేవు. మరికొన్ని చోట్ల లైట్లు ఉన్నా అవి వెలగడంలేదు. దీంతో రాత్రి వేళల్లో బస్సు దిగి వెళ్లే పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు వార్డుల్లో స్ట్రీట్ లైట్లు వెలుగక చీకట్లు కమ్ముకుని రాత్రికి ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని దుస్థితి నెలకొందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల స్తంభాలకు స్ట్రీట్ లైట్లు ఉన్నప్పటికీ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పనిచేయడంలేదంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజల కష్టాలు పట్టించుకునేవారు కరువయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ ఒక్క అధికారి కూడా వార్డుల్లో పర్యటించి ప్రజాసమస్యలు తెలుసుకున్న పాపనపోలేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ఎంఐఎం నాయకులు

నవాబుపేట, మార్చి 24: పవిత్ర మాసం రంజాన్ సందర్భంగా ఎంఐఎం నాయకుడు సమీర్ సయ్యద్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఆదివారం మండల కేంద్రంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. రంజాన్ మాసంలో అల్లా పేరుతో దాన ధర్మాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, మార్చి 24: సీఎం రేవంత్‌రెడ్డిని బొంరాస్‌పేట్ మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు భీమ్‌రెడ్డి, బాలప్ప, పవన్‌కల్యాణ్, రామ్‌రెడ్డి, చందు, బాల్‌రాజ్, సాయిలు, లక్ష్మణ్, మల్లప్ప, చాంద్, నజీర్, మహబూబ్, సలాం, మోహన్, అశోక్, నరేందర్ తదితరులు కలిశారు. హైదరాబాద్‌లో వారు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కొత్తూర్ గ్రామంలో అభివృద్ధి పనుల గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సీఎం త్వరలోనే పనుల మంజూర్‌కు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

వడ్డీ బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న శివానంద్ ఠాకూర్

తాండూరు: మార్చి 24: వడ్డీ డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యాపారి ఆటో డ్రైవర్ బాలయ్యను చితకబాదిన విషయం తెలిసిందే. బాధితుడికి జాతీయ అవార్డు గ్రహీత, జర్నలిస్టు శివానంద్ సింగ్ ఠాకూర్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధితుడిని అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, బాలయ్య, యజమాని రాజు, తదితరులు పాల్గొన్నారు.

26న సర్వసభ్య సమావేశం

ఘట్‌కేసర్, మార్చి 24: ఈనెల 26న ఘట్‌కేసర్ సహకార సంఘం సర్వసభ్య సమావేశంను నిర్వహిస్తున్నట్లు ఆసంఘం మేనేజింగ్ డైరెక్టర్ ఎం కరుణాకర్ తెలిపారు. ఘట్‌కేసర్‌లోని నారాయణ గార్డెన్‌లో మంగళవారం ఉదయం 11గంటలకు చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ముఖ్యఅతిథిగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోఠి రిజియన్ ప్రధానాధికారి కళ్యాణ్ వర్మ హాజరవుతున్నట్లు తెలిపారు.